

వాట్సాప్ ద్వారా పన్నులు చెల్లించండి: కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిదారుల వివరాలను నగరపాలక సంస్థ కార్యాలయం, అన్ని సచివాలయాల పరిధిలో నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య గురువారం తెలిపారు. బకాయిదారులు వాట్సాప్ ఫోన్‌నంబర్ 95523 00009 ద్వారా చెల్లింపులను సులభతరంగా చేసుకోవచ్చు న్నారు. పన్నులు చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని, ఆంధ్రప్రదేశ్ నగర పాలక సంస్థ చట్టం 1955లోని సెక్షన్ 269(2) ప్రకారం ఆ ఇళ్లకు మంచినీరు, విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తామని హెచ్చరించారు.

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.4 శాతం పోలింగ్
- అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 96 శాతం,
- అతి తక్కువగా విశాఖ జిల్లాలో 87.34 శాతం





ఓటేస్తున్న ఉపాధ్యాయురాలు

విజయనగరం సంగీత కళాశాల పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు

ఓటెత్తిన ఉపాధ్యాయులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా, 20,783 మంది (92.4 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 13,508 మందికి 12,557 మంది, మహిళలు 8,985 మందికి 8,226 మంది ఓటు వేశారు. అత్యధికంగా అనకాపల్లి (మిగతా 8వ పేజీలో..)



పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను బస్సులోకి ఎక్కిస్తున్న దృశ్యం





విజయనగరంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ప్రధాన అభ్యర్థులు విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, రఘువర్మ

పోలింగ్ ప్రశాంతం..

విజయనగరం/ క్రైం/ భోగాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడి ఎన్నిక జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 94.05 శాతం పోలింగ్ నమోదైంది. 29 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఎన్నిక జరిగింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ సాగింది. మొత్తం 5223 ఓటర్లు ఉండగా 4912 ఓట్లు పోలయ్యాయి. జిల్లా కేంద్రంలోని సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ బూత్‌లను కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్, ఆర్డీవో కీర్తి, తహసీల్దార్ కూర్మనాధ్‌రావు పర్యవేక్షించారు. విజయనగరం డివిజన్‌లో 14 పోలింగ్ కేంద్రాల్లో 3038 మంది (93.22 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. బొబ్బిలి డివిజన్‌లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో 1011 (95.02 శాతం) ఓటు వేశారు. చీపురుపల్లి డివిజన్‌లోని ఎనిమిది పోలింగ్ కేంద్రాల్లో 863 (95.89 పోలింగ్ శాతం) మంది ఓటు వేశారు. పోలింగ్ సరళిని ఎన్నికల అధికారి, కలెక్టర్ అంబేడ్కర్ కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. భోగాపురం కేంద్రాన్ని కూడా స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్ ముగిసిందని, 94.05 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. బ్యాలెట్ బాక్సులను విశాఖలోని రిసెప్షన్ సెంటర్‌కు ఏఆర్ పోలీసుల భద్రత నడుమ తరలించారు. విజయనగరంలో పోలింగ్ కేంద్రాన్ని ప్రధాన అభ్యర్థులు విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, రఘువర్మ సందర్శించారు.

పర్యవేక్షించిన ఎస్పీ వకుల్‌జిందాల్..

పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ వకుల్‌జిందాల్ గురువారం స్వయంగా పర్యవేక్షించారు. సంగీత కళాశాలలోని మూడు పోలింగ్ కేంద్రాలు, నెల్లిమర్ల జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.



రద్దీగా పుణ్యగిరి మెట్ల మార్గం, (ఇన్‌సెట్)లో పూజలందుకుంటున్న ఉమాకోటిలింగేశ్వర స్వామి

పుణ్యగిరి.. భక్తజన సంద్రం

మెట్లదారిలో మారుమోగిన శివనామం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి కొండ మెట్లపై శివనామం మారుమోగింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు 'శంభోశంకర' ప్రతిధ్వనించింది. దారగంగమ్మలోయ, పుట్టదార ఘట్టాల వద్ద భక్తులు స్నానాలు చేసేందుకు పోటీపడ్డారు. ఉమా కోటిలింగేశ్వర స్వామి దర్శనానికి ఉచిత, రూ.20, రూ.50 క్యూలైన్లన్నీ నిండిపోయాయి. మెట్లదారి చీమలదండును తలపించింది. భక్తులను తొందరగా పంపించేందుకు పోలీసు, దేవాదాయశాఖ సిబ్బంది పుట్టదార వద్దకు వచ్చిన నీటిని పైపులతో తలలపై చల్లేందుకు చూశారు. అయితే భక్తులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. శంకర స్వామి భక్తులు అన్నదానం చేశారు. భక్తుల కోసం ఆర్టీసీ బస్సులను నడిపింది.



రామతీర్థం దేవస్థానం ఎదురుగా భక్తుల కోలాహలం

రామతీర్థం.. భక్తజన సందోహం

రహదారులన్నీ కిటకిట


నెల్లిమర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం దేవస్థానం వద్ద రెండు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి జాతర ముగిసింది. జాతర కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తుల గురువారం సాయంత్రం రామతీర్థం నుంచి తిరుగు ముఖం పట్టారు. బుధవారం రాత్రంతా జాగరణ చేసి తిరిగి గురువారం ఉదయం సీతారాములను, ఉమాసదాశివస్వామిని వేలాదిగా దర్శించుకున్నారు. రామతీర్థం నుంచి గొర్లెపేట, దేవుని నెలివాడ వరకు రోడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పకడ్బందీ ఏర్పాట్లుచేశారు.

భూ యజమానుల సమక్షంలో రీసర్వే
- కలెక్టర్ అంబేడ్కర్
7లో

కార్డుదారులూ ఈకేవైసీ చేయించుకోండి
- జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు
8లో

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి
- హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం
7లో

క్వార్టర్‌పై మరో రూ.10



- మద్యం సిండికేట్ ఇష్టారాజ్యం
- బెల్టు నిర్వాహకులు, లైసెన్స్ దుకాణదారులు కుమ్మక్కు
- విరివిగా డోర్ డెలివరీలు
- మందుబాబులపై బాదుడే బాదుడు

మద్యంషాపుల యజమానులు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒక్కటైపోయారు. వారు అనుకున్నదే ధరగా అమలు చేస్తున్నారు. మందుబాబుల నుంచి క్వార్టర్‌పై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా మామూళ్లు అందుకుని తెలియనట్టు నటిస్తున్నారు. బెల్టుషాపులను కట్టడి చేస్తే వ్యాపారం చేయలేమని మొన్నటివరకు సన్నాయినొక్కులు నొక్కిన లైసెన్స్‌దారులు ఇప్పుడు.. ఆ బెల్టుషాపులకు సరఫరా చేసే మద్యం సీసాలపై అదనపు ధర వడ్డించి మద్యం ప్రియుల నడ్డి విరుస్తున్నారు. అంతేకాకుండా ఆ షాపులకు డోర్ డెలీవరీ కూడా మొదలుపెట్టేశారు. ఏమీ జరగనట్టు యంత్రాంగం చోద్యం చూస్తోంది.

మెంటాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులు నిర్వహించినా.. మద్యం ధరలు ఎంఆర్‌పీ కన్నా పెంచినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ప్రభుత్వం పదేపదే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశిస్తోంది. ప్రతి షాప్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిత్యం పర్యవేక్షించాలని, మద్యం ఉల్లంఘనలకు పాల్పడే షాపులకు మొదటిసారి రూ.5లక్షల జరిమానా విధించాలని, రెండోసారి పట్టుబడితే లైసెన్సు రద్దుచేయాలని విస్పష్ట ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం నూతన పాలసీలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. జిల్లాలో మాత్రం ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. మరోవైపు ఎక్కడికక్కడే గొలుసు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. బెల్టుషాపుల నిర్వహణ ఉపాధిలా మారిపోయింది. అధికారులు చేపట్టే మొక్కుబడి దాడులు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వడం లేదు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు బెల్టుషాపులకు ఎమ్మార్పీకి మద్యం సరఫరా చేసే షాపుల యజమానులు క్వార్టర్ సీసాపై రూ.10 అదనపు ధరకు అమ్ముతున్నారు. ఇదేంటని అడిగితే, రిస్కుతో కూడుకున్నందున తప్పడం లేదని చెప్పుకొస్తున్నారు. నచ్చితే కొనండి లేదంటే పొమ్మనడంతో లాభాల రుచిమరిగిన బెల్టు నిర్వాహకులు ఆ భారాన్ని మందుబాబులపై మోపుతున్నారు. బెల్టుషాపుల్లో (మిగతా 8వ పేజీలో..)

బెల్ట్‌కు డోర్ డెలివరీ

లైసెన్స్‌దారులు ఇప్పటివరకు కొన్ని బెల్టుషాపులకే డోర్ డెలివరీ చేస్తుండగా తాజాగా వేలంపాట జరిగిన గ్రామాలకు కూడా డోర్ డెలివరీని విస్తరించారు. వేలంపాటలకు అధికార యంత్రాంగం నో చెబుతుండడంతో గ్రామాల్లో నాయకులంతా కలిసిపోయి బెల్ట్ వేలంపాటలు నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధి, గ్రామదేవత పండుగలు, గుడి నిర్మాణాలకు ఆ డబ్బులు ఖర్చు చేస్తామని చెబుతున్నారు. ఆపై మద్యం షాపుల యజమానులు, వేలంపాటదారులు పరస్పర అవగాహనకు వస్తున్నారు. షాపుల యజమానులు గ్రామ శివార్లకు గుట్టుగా మద్యాన్ని చేరుస్తున్నారు. ఇందుకోసం సీసాపై రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తుండగా, ఆ భారాన్ని వేలం షాపులవారు మందుబాబులపై మోపుతున్నారు. గ్రామాల్లో ఏమి జరుగుతోందో మహిళా పోలీసులకు, పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, వీపీవోలకు తెలియకుండా ఉండదు. వారు కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.



పాఠశాల ఆవరణలో తుప్పు పట్టిన ఆట సామగ్రి

పర్యవేక్షణ లేక.. పరికరాలకు తుప్పు

● నిరుపయోగంగా పడి ఉన్న సామగ్రి

● ఆటలకు దూరమవుతున్న సంతకవిటి విద్యార్థులు

సంతకవిటి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సంతకవిటి ప్రాథమిక పాఠశాల నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన క్రీడా పరికరాలనిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడంతో తుప్పుపట్టి పాడయ్యాయి. గత ప్రభుత్వం మూడేళ్ల కిందట పాఠశాల విద్యార్థులు ఆటల కోసం లక్షలాది రూపాయలతో ఏర్పాటుచేసిన ఆట సామగ్రి నిరుపయోగంగా మారాయి. ఇనుప ఊయలు, జారుడు బల్ల, వాకింగ్ సైకిలింగ్‌తోపాటు పలు వ్యాయామ పరికరాలను ఏర్పాటుచేశారు. ఆయా పరికరాలు తుప్పుపట్టి మట్టి పాలై ప్రమాదకరంగా మారాయి. అప్పట్లో పాఠశాల గోడలపై వేసిన చిత్రాలు కూడా చెరిగిపోయాయి. తుప్పుపట్టిన పరికరాలపై విద్యార్థులు ఆడే సమయంలో తరచూగాయపడుతున్నారు. క్రీడా, వ్యాయామ పరికరాలు పాడవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతు న్నారు. కాగా పరికరాలు తుప్పుపట్టడంతో విద్యార్థులు వాటిపై ఆడ కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పరికరాల పరిస్థితిని ఉన్నతా ధికారులకు తెలియజేశామని హెచ్‌ఎం వై.ఎలిజిబిత్ రాణి చెప్పారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

● పోలింగ్ సరళిపై కూటమి నాయకుల సమీక్ష

● రఘువర్మకు మద్దతుగా శిబిరాల నిర్వహణ



నెల్లిమర్ల: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



రాజాం: ఓటరు జాబితాను పరిశీలిస్తున్న చీపురుపల్లి ఆర్డీవో బీవీ సత్యవాణి



మెరకముడిదాం: ఓటింగ్ సరళిని నాయకుల నుంచి తెలుసుకుంటున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

జిల్లాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాలకు కొద్దిదూరంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా కూటమి నాయకులు శిబిరాలు ఏర్పాటుచేశారు. ఆయా శిబిరాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీ, టీడీపీ నాయకులు ఓటింగ్ సరళిపై సమీక్షించారు.

● మెరకముడిదాం/గుర్ల/దత్తిరాజేరు: ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం, గుర్ల, దత్తిరాజేరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ నాయకుడు, కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అడిగి తెలుసుకున్నారు.

● గంట్యాడ ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గంట్యాడ జడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో దాట్ల కీర్తి తనిఖీ చేశారు. ఇక్కడ కూటమి నాయకులు ఏర్పాటు చేసిన ఓటరు స్లిప్‌లు పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున పరిశీలించారు.

● కొత్తవలస/జామి/శృంగవరపుకోట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం ఆవరణలో కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తున్న శిబిరంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ పాల్గొన్నారు. కొత్తవలసలో ఎన్నికల స్లిప్‌లు పంపిణీ చేసేందుకు టెంట్ వేసేందుకు అభ్యర్థుల మద్దతుదారులు ప్రయత్నించారు. కాగా తహసీల్దార్ బి. నీలకంఠారావు అడ్డుకోవడంతో యూటీఎఫ్ నాయకులు ఆయన్ను ప్రశ్నించారు. అలాగే జామిలో పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కూటమి నాయకులు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, స్వామినాయుడు, వర్రి రమణ ఆధ్వర్యంలో పరిశీలించారు. పోలింగ్ సరళిపై వీరితో చర్చించారు. కాగా శృంగవరపుకోటలో ఏర్పాటుచేసిన శిబిరంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, పెదగాడ రాజు, కిరణ్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

● డెంకాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):డెంకాడలో జరిగిన ఎమ్మెల్సీ ఓటింగ్ సరళిని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరిశీలించారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షులు పల్లె భాస్కరరావు ఉన్నారు.

● రాజాం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని చీపురుపల్లి ఆర్డీవో బీవీ సత్యవాణి, ఎన్నికల డిటీ ప్రకాష్ ఆర్ఐ కె.అబ్బాస్ పరిశీలించారు. పోలింగ్‌సరళిని ఎంపీ కలిశెట్టి అప్పనాయుడు పరిశీలించారు.కాగా ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రఘువర్మ, కోండ్రు జగదీష్, ఎన్నికల పరిశీలకులు కలిసి సంతకవిటి, వంగర, రేగిడి మండలాల్లో పర్యటించారు.

● నెల్లిమర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల పోలింగ్‌కేంద్రాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. పాకలపాటి రఘువర్మకు మద్దతునిస్తున్న కూటమి నాయకులు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజక వర్గ పరిశీలకుడు నజీర్ నాలుగు మండలాల్లోపర్యటించి పోలింగ్ సరళిని సమీక్షించారు.



గంట్యాడ: కూటమి నాయకులు ఏర్పాటు చేసిన శిబిరంలో చర్చిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున

● బొబ్బిలి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి ఎమ్మెల్యే బేబీనాయనను గౌరవప్రదంగా పలకరించారు.బొబ్బిలిలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద పాకలపాటి రఘువర్మకు మద్దతుగా శిబిరంలోఉన్న కూర్చొన్న బేబీనాయన దగ్గరకు ఆమె వచ్చి పలకరించారు. బేబీనాయన కూడా ఆమెను ఆప్యాయంగా పలకరించారు.



డెంకాడ: శిబిరంలో నాయకులతో మాట్లాడుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



శృంగవరపుకోట: పోలింగ్ సరళిపై నాయకులతో మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి



బొబ్బిలి: పోలింగ్ కేంద్రం పరిసరాల్లో పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

నిర్మాణాలు తొలగించాలి

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రహదారులు ఆక్రమించి చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ప్రణాళిక సిబ్బందిని నగర పాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. గురువారం రింగురోడు నుంచి నటరాజ్‌కాలనీ వరకు పారిశుధ్య నిర్వహణ, ఆక్రమణలు పరిశీలించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వంగర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస జూనియర్ కళాశాలలో మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ కోట రవిశంకర్ తెలిపారు. ఇక్కడ మడ్డువలస గురుకులం, కేజీబీవీతో పాటు రేగిడి మండలం దేవుదల కేజీబీవీ, ఉంగరాడమెట్ట మోడల్ స్కూల్ చెందిన మొదటి సంవత్సర విద్యార్థులు 261 మంది, ద్వితీయ సంవత్సరానికి చెందిన 237 మంది పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ధర్మవరంలో వీరకుమారుని తీర్థం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని ధర్మవరంలో దేవాంగులు తమ కులదైవం వీరకుమారుని ఉత్సవం శివరాత్రి పురస్కరించుకుని నిర్వహించారు. ఈసందర్భంగా చేపట్టిన నృత్యాలు, ప్రభల ఊరేగింపు ఆకట్టుకున్నాయి.

డెంకాడలో తాడమ్మతల్లి ఉత్సవాలు

డెంకాడ,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) డెంకాడ తోట కల్లాల సమీపంలో గల తాడమ్మతల్లి ఆలయ 15వ వార్షికోత్సవ దేవర ఉత్సవాలు కమిటీ సభ్యులు నిర్వహించారు. గురువారం అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం నాలుగు గంటలవరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీగణపతి కాలనీ, సుబ్రహ్మణ్యంటెంపుల్ ఏరియా, జగదాంబనగర్, గోల్డెన్ లేఅవుట్ వ్యాలీ, పూల్‌బాగ్ కాలనీ మెయిన్‌రోడు, హాజీ ఆలీ నగర్, మంగళవీధి కాలనీల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

● గజపతినగరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం రూరల్ ఫీడర్‌కు మరమ్మతులుచేయడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అనంతరావు తెలిపారు.సీతారామపురం,పిడిశీల, ముద్దూరుల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

వసతిగృహాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం

భోగాపురం,ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి బీసీ బాలుర వసతిగృహాన్ని పూర్తి స్థాయి వినియోగంలోకి తీసుకువస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జి.పెంటాజీరావు తెలిపారు. నిర్వహణ లేక నిరుపయోగం శీర్షికతో ముక్కాం బీసీ బాలుర వసతి గృహ పరిస్థితిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితంకావడంతో అధికారులు స్పందించారు.ఈమేరకు గురువారం ముక్కాంలోగల నిరుపయోగంగా ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని పెంటాజీరావు పరిశీలించారు.కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యువో రాజులమ్మ, వార్డెన్ సరస్మయి పాల్గొన్నారు.



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న పెంటాజీరావు

ఇరువర్గాలను పిలిపించి చర్చిస్తాం: ఎస్ఐ

గరివిడి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్నందిలో తల్లిని ఇంటి నుంచి గెంటేసిన కుమారుడిపై అమ్మను బయటకు గెంటేశారు శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం వెలువడడంతో దళిత సంఘ నాయకులు స్పందించారు.ఈమేరకు దళిత సంఘనేతలు గొట్నంది గ్రామపెద్దలు, పోలీసు అధికారులతో నక్కా ఎర్రమ్మ సమస్యపై మాట్లాడారు. సోమవారం పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాలను పిలిచి చర్చించి ఎర్రమ్మకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

భూముల ఆక్రమణదారులకు నోటీసులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తాటిపుడిలో ప్రభుత్వ భూములు ఆక్రమించినవారికి ముసిడిపల్లి వీఆర్వో నాయుడు 6 నోటీసులు గురువారం అందజేశారు. ఈనెల 24న ఆంధ్రజ్యోతిలో ఆక్రమణలు తొలగించేదెప్పుడు శీర్షికతో కథనం ప్రచురితం కావడంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ తహసీల్దార్ సూచనల మేరకు నోటీసులు ఆక్రమణదారులకు అందించామని, 15 రోజుల్లో ఆక్రమణలు తొలగింపు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. 20 రోజుల కిందట 7-ఏ నోటీసులు ఇచ్చినప్పుడు విజయనగరానికి చెందిన వైద్యుడు ఆ భూమి వినియోగంలో లేదని, తమకు ప్రభుత్వ ధరకు కేటాయించాలని తాము ఇచ్చిన నోటీసుకు బదులు పంపించారని తెలిపారు.మరో వ్యక్తి ఆక్రమణలు తామే తొలగించుకుంటామని, సమయం కోరినట్లు చెప్పారు.అయితే ఆక్రమణ దారులకు రెవెన్యూశాఖ 6నోటీసులు ఇవ్వడం చర్చంశనీయంగా మారింది.

గిరిజన గ్రామాలపై నిఘా ఉంచండి

శృంగవరపుకోట మండలంలోని గిరిజన గ్రామాలపై వైద్య ఆరోగ్య శాఖ నిరంతర నిఘా ఉంచాలని జిల్లా వైద్యాశాఖాధికారి జీవనరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిశిఖర గ్రామాల్లో విషజ్వరాలపై శీర్షికతో ఈనెల 26న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించారని పేర్కొన్నారు. ప్రస్తుతం విషజ్వరాలతో బాధపడుతున్న చిన్నారులు కోలుకున్నారని, ఇంటింటా సర్వేతో పాటు వారి ఇళ్లల్లో యాంటిలార్వాస్ప్రే చేయించినట్లు తెలిపారు.

భూ యజమానుల సమక్షంలో రీసర్వే: కలెక్టర్

భోగాపురం, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): భూ యజమానుల సమక్షంలో రీసర్వే నిర్వహించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్వే సిబ్బందికి ఆదేశించారు. రీసర్వే పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని రావాడ గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రావాడ పరిధిలో గల భూముల వివరాలు, మ్యాప్ పరిశీలించి రైతులతో మాట్లాడి అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా రీసర్వే పక్కాగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. రైతులతో మాట్లాడి రికార్డులు, మ్యాప్, తదితర వివరాలతో రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ, సర్వే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేమ్యాప్ ఆధారంగా సూచనలు చేస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

జీజీహెచ్‌కు ఆధునిక పరికరాలు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) మార్చి 15లోగా ఆధునిక పరికరాలను అందించి, అదనపు సదుపాయాలు కల్పించాలని కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా జీజీహెచ్‌కు రూ.కోటితో అత్యాధునిక పరికరాలను అందించేందుకు కావ్వాడలోని ఎన్‌పీసీఐఎల్ ఇటీవల కలెక్టరుతో ఎంవోయు కుదుర్చుకున్న విషయంవిదితమే. ఈ నిధులతో ఆపరేషన్ థియేటర్ న్యూరాలజీ, యూరాలజీ, బయో కెమిస్ట్రీ, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ తదితర విభాగలకు వివిధ పరికరాలను సమకూర్చనున్నారు. ఈ నిధులపై గురువారం తన చాంబర్‌లో కలెక్టర్ సమీక్షించారు. పరికరాల కొనుగోలుకు వారంరోజుల్లోగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. సమావేశంలోని సీపీవో బాలాజీ, సూపరింటెండెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం సామాజిక బాధ్యత అని మెటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. గురువారం విజయనగరంలోని ఐయ్యన్న పేట జంక్షన్‌లో మదర్ థెరిషా సేవా సంఘం, బ్లడ్‌డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో మాట్లాడారు. కార్యక్రమంలో మదర్‌థెరిసా సేవ సంఘం గౌరవాధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, అధ్యక్షుడు ప్రసాద్ పట్నాయక్ పాల్గొన్నారు.

సాంకేతిక యుగానికి నాంది పలకాలి

● రాష్ట్ర ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారుడు జేపీ చౌదరి

రాజాం రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యువత నవ్య ఆవిష్కరణలతో కొత్త సాంకేతిక యుగానికి నాంది పలకాలని, ఈ దిశగా విద్యార్థులు చిన్ననాటి నుంచే కొత్త ఆలోచనలు చేసే విధంగా పరిస్థితులను ఏర్పరచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ఐటి సలహాదారు, ఇండియన్ బ్లాక్‌చైన్ స్టాండర్డ్స్ కమిటీ చైర్మన్ జేపీ చౌదరి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయస్థాయి స్టూడెంట్ టెక్నికల్ పేపర్ అండ్ ప్రాజెక్ట్ కాంటెస్ట్, ఎగ్జిబిషన్ (స్టెప్‌కాన్)లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందుతోందని, కొత్తకొత్త టెక్నాలజీ రాబోతున్న సమయంలో భవిష్యత్‌లో స్థిరమైన ప్రభుత్వ ఉద్యోగాలు ఉండవని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి 3,884 మంది విద్యార్థుల ప్రాజెక్ట్ ఎక్స్‌పో, స్టార్టప్ ఐడియా కాంటెస్ట్, పేపర్ ప్రెజెంటేషన్, వర్క్‌షాప్స్ తదితర అంశాలు సదస్సులో నమోదుచేసుకున్నారు.



మాట్లాడుతున్న జేపీ చౌదరి

యువతకు ఉద్యోగావకాశాలు

● నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నజీర్

నెల్లిమర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయమని ఎమ్మెల్సీ ఎన్నికల నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నజీర్ తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా అమలుచేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందనిచెప్పారు. గురువారంనెల్లిమర్లలోవిలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసిందని, అన్ని వ్యవస్థలు, రంగాలు కుప్పకూలిపోయాయని తెలిపారు.సమావేశంలో పరిశీలకుడు పాండ్రంకి జయరాజ్, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నజీర్

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



కిరణ్ కుమార్ (ఫైల్)

గరుగుబిల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి చిలకాం గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గుల్ల కిరణ్‌కుమార్ (31) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన భార్య శ్రీకళ హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ప్రేమ వివాహం చేసుకున్న వీరికి 16 నెలల కుమార్తె నిశీరా ఉంది. అయితే కిరణ్‌కుమార్ తన తల్లి ముగతమ్మను స్వగ్రామం నుంచి హైదరాబాద్ తీసుకువచ్చేందుకు మంగళవారం చిలకాం వచ్చాడు. ఇక్కడి నుంచి తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు బుధవారం సాయంత్రం తల్లితోపాటు రాయగడ-గుంటూరు రైలుఎక్కారు. సీతానగరం స్టేషన్‌కు వచ్చిన సమయంలో ఫోన్ రావడంతో తలుపు దగ్గరికి వెళ్లగా, ప్రమాదవశాత్తు తలుపు తగిలి సువర్ణముఖి వంతెన సమీపంలో జారిపడ్డాడు. విజయనగరం వెళ్లేంత వరకు కుమారుడు మృతిచెందాడన్న విషయం తల్లి ముగతమ్మకు తెలియలేదు. తర్వాత వంతెన సమీపంలో పనులు నిర్వహిస్తున్న కూలీల ద్వారా విషయంతెలియడంతో తల్లి కన్నీరుమున్నీరయ్యింది. కిరణ్‌కుమార్‌కు తల్లితో పాటు తండ్రి సూర్యనారాయణ ఉన్నారు. సూర్యనారాయణకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు పోస్టల్ ఉద్యోగి, రెండో కుమారుడు కిరణ్‌కుమార్. గ్రామంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన కిరణ్‌కుమార్ ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామస్థులు కన్నీట పర్యంతమయ్యారు. గురువారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లిని తీసుకువెళ్లేందుకు వచ్చి తనువు చాలించాడని పలువురు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

మందుల కోసం వచ్చి మెడికల్ షాపు వద్దే..

మహారాణిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపు వద్దకు ఓ వ్యక్తి ఆయాసపడుతూ వచ్చి మందులు అడుగుతూ కుప్పకూలిపోయాడు. అతనిని ఆసుపత్రికి తరలించేందుకు 108 వాహనానికి ఫోన్ చేయగా, వారు ఆలస్యంగా స్పందించడంతో ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం బుదరాయవలసకు చెందిన వాసిరెడ్డి రమణ (60) గురువారం మధ్యాహ్నం అల్లిపురంలోని నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలోని ఒక మెడికల్ షాపు వద్దకు వచ్చాడు. తనకు ఆయాసంగా ఉందని, మందులు కావాలని అడిగాడు. అడుగుతుండగానే అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడ మెడికల్ షాపు యజమాని వెంటనే 108 సిబ్బందికి ఫోన్ చేశారు. వారు కొంత ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. వారు వచ్చి ఆ వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులకు ఈ విషయం తెలియడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తి వివరాలుతెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

మామిడితోటలో వృద్ధుడి మృతదేహం గుర్తింపు



అప్పన్న (ఫైల్)

గజపతినగరం,ఫిబ్రవరి 27:(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడి వాడలో గల మామిడితోటలో ఓ వృద్ధుడు మృత దేహం గుర్తించారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదుపాడకు చెందిన చుక్క చిన్నఅప్పన్న (65) రెండేళ్లగా మతి స్థిమితం లేకపోవడంతో ఇల్లు విడిచి తరచూ వెళ్లిపోతుండేవాడు. ఆ మాదిరిగానే ఈనెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రెండురోజుల వరకు ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లకు వెళ్లి ఉంటాడని కుటుంబసభ్యులు భావించారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో చినఅప్పన్న పోటోలతో కరపత్రాలను కుటుంబసభ్యులు పంపిణీచేసి వెతికారు. ఈ నేపథ్యంలో గురువారం గుడివాడ గ్రామస్థులు ఉపాధిహామీ పనులకు వెళ్లి వస్తుండగా మామిడితోటలో మృతదేహం కనిపించడంతో గ్రామపెద్దలకు తెలియజేశారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందజేయడంతో ఎస్ఐ కె. లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.మదుపాడకు చెందిన వృద్ధుడుఇటీవల మతిస్థిమితంలేక ఇంటి నుంచి వెళ్లి పోయినట్లు పోలీసులు తెలుసుకున్నారు. దీంతో పోలీసులు ఆ గ్రామానికి సమాచారం తెలియజేశారు. అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు చిన్నఅప్పన్న మృతదేహంగా గుర్తించారు. అప్పన్నకు భార్య సత్తమ్మ,ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

కుటుంబ తగాదాలతో ఆరుగురికి గాయాలు

భామిని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలికిరి గ్రామంలో బాబాయి, అబ్బాయిల మధ్య పాత తగాదాలు గురువారం కొట్లాటకు దారితీశాయి.పోలీసుల కథనం మేరకు... సొలికిరి గ్రామానికి చెందిన గౌడు రవికి తన చిన్నాన్న మార్కొండకు నిత్యం తగాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఈక్రమంలో గురువారం మార్కొండ కుమారుడు బాలకృష్ణ ఒడిశా నుంచి పలువురు బంధువులకు తీసుకొచ్చి రవిపైన దాడికి దిగాడు. స్థానికులు అప్రమత్తం కావడంతో ఒడిశా నుంచి వచ్చిన బంధువులు తప్పించుకున్నారు.ఈఘటనలో రవి, తన భార్య శ్రీవేణితో పాటు మార్కొండ, తన భార్య జామంతి, కొడుకు బాలకృష్ణతోపాటు బంధువు టి.రాజు తీవ్రంగా గాయపడ్డారు. రవి, శ్రీవేణిలను 108 వాహనంలో సీతంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే మార్కొండ, జామంతి, బాలకృష్ణ, టి.రాజులను కొత్తూరు పీహెచ్‌సీకి తరలించారు. ఈ నలుగురిని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి రిఫర్ చేశారు. దీనిపై బత్తిలి ఎస్ఐ అనీల్‌కుమార్ వద్ద ప్రస్తావించగా వారివి పాత తగాదాలు, గతంలో కేసులు ఉన్నాయని, దీనిపై కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పెద్దవీధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వసంత రమణని అదుపులోకి తీసుకుని 13 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ గురువారం తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో తదుపరి చర్యలు నిమిత్తం ఎస్.కోట ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రాజశ్రీ , హెచ్‌సీ నాగేశ్వరావు, ఈసీలు నాయుడు,మనోజ్ పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థంలో ఓ వ్యక్తి నుంచి 83 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ వివరించారు.

● బొండపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎం.కొత్తవలసలో గురువారం గజపతినగరం ఎక్సైజ్ శాఖ సీఐ జె.జనార్దనరావు ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు.ఈ మేరకు గ్రామానికి చెందిన బొచ్చ చిట్టిదాసు అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టడంతో ఎస్ఐ పి.నరేంద్రకుమార్ సిబ్బందితో దాడిచేసి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.దాడుల్లో హెచ్‌సీ మహమ్మద్ జే.భాషా, లోకాబిరామ్, సిబ్బంది పాతి మాబేగం, సౌజన్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు: సీఐ

రాజాం రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరరావు సూచించారు. గురువారం రాత్రి మునిసిపాలిటీ పరిధిలోని పొనుగుటివలసలో నిర్వహించిన అవగాహన సదస్సులో మత్తు పదార్థాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి వినియోగించినా, కలిగి ఉన్నా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

గంట్యాడ ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పశువులకు మార్చి ఒకటో తేదీ నుంచి 31 వరకూ గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడి రెడ్డి కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు నెలలు పైబడిన అన్ని పశువులకు టీకాలు వేస్తామని తెలిపారు.

నిరుద్యోగ సంఘం మండలాధ్యక్షుడిగా సన్యాసప్పడు

గుర్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శేషపుపేట గ్రామానికి చెందిన దొంతల సన్యాసప్పడును నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కుమార్ ఆ సంఘం మండలాధ్యక్షులుగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు సన్యాసప్పడు కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మానవ జీవితంలో సైన్స్ పాత్రపై అవగాహన

నెల్లిమర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలోజాతీయ సైన్స్ దినోత్సవవాన్ని పురస్కరించుకుని గురువారం మానవ జీవితంలో సైన్స్ పాత్ర, యోగాపై పరిశోధన అన్న అంశంపై మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.జీవన్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామన్ ప్రభావం, యోగాలో సైన్స్ పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, దినేష్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

● ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ● బందోబస్తు నిర్వహించిన పోలీసులు
● అభ్యర్థులకు మద్దతుగా శిబిరాల్లో కూర్చున్న ప్రజాప్రతినిధులు



సీతంపేటలోని పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

బొబ్బిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూలులో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బొబ్బిలి రెవిన్యూ డివిజన్ పరిధిలో గల ఏడు మండలాల్లో 95.02 శాతం ఓటింగ్ జరిగినట్లు బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు తెలిపారు. గొల్లపల్లి పోలింగ్ కేంద్రాన్ని జేసీ సేతు మాధవన్ పరిశీలించారు. ● రామభద్రపురం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద రఘువర్మకు మద్దతుగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శిబిరంలో కూర్చున్నారు. బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ● బాడంగి: టీడీపీ అభ్యర్థి రఘువర్మ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద ఆయన రఘువర్మకు మద్దతుగా శిబిరంలో కూర్చున్నారు. ● పాలకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సీఐ చంద్రమౌళి బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ పోలింగ్ సరళిని పరిశీలించారు. ● సీతానగరం: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ అంకిత సరాన, సబ్ కలెక్టర్ శోభికలు సందర్శించారు. ● గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.. అభ్యర్థి తరపున శిబిరంలో కూర్చొన్నారు. ● సాలూరు: కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపు ఖాయమని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఆమె రఘువర్మకు మద్దతుగా శిబిరంలో కూర్చున్నారు. అనంతరం ఆమె పీఆర్‌టీయూ, పీడీఎఫ్ శిబిరాల్లో ఉన్న ఉపాధ్యాయులను పలకరించారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశ్ తదితరులు ఉన్నారు. ● అలాగే పీడీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మంత్రి సంధ్యారాణిని పలకరించి, నమస్కరించారు. ● గరుగుబిల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో అసౌకర్యాలు నెలకొనకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. ● పార్వతీపురం: పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర రఘువర్మకు ఓటు వేయాలని కోరుతూ స్వయంగా ఉపాధ్యాయ ఓటర్లకు స్లిప్పులను అందించారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొని, రఘువర్మకు మద్దతుగా శిబిరంలో కూర్చొన్నారు. టీడీపీ నాయకులు ఉన్నారు. ● పార్వతీపురం: కూటమి మద్దతు ఇస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ గురువారం పార్వతీపురానికి వచ్చారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. కూటమి నాయకులతో ముచ్చటించారు. ● సీతంపేట రూరల్: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి పోలింగ్ బూత్‌ను పరిశీలించారు.



సాలూరు: పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరీతో కరచాలనం చేస్తున్న మంత్రి సంధ్యారాణి



పాలకొండ: పోలింగ్ కేంద్రం వద్ద కూటమి నాయకులతో ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ



పాలకొండ: ఓటు వేసిన ఉపాధ్యాయ దంపతులు



బొబ్బిలిలో ట్రైసైకిల్‌పై వచ్చి ఓటు వేసిన దివ్యాంగ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు



గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



రామభద్రపురం: శిబిరంలో కూర్చున్న ఎంపీ కలిశెట్టి



గుమ్మలక్ష్మీపురం: పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



పార్వతీపురం: ఓటర్లకు స్లిప్పులను అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

న్యూస్ బాక్స్

జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు అపర్ణబాబా



అపర్ణబాబా

బొబ్బిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు అపర్ణబాబా వచ్చే నెల 16 నుంచి గోవాలో జరగనున్న జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో డబుల్స్‌లో 50ఏళ్ల విభాగంలో అపర్ణబాబా.. విశాఖకు చెందిన మురళీ వర్ధన్‌తో కలిసి ఆడి విజేతగా నిలిచాడు. ఈ మేరకు మార్చి 16 నుంచి 21 వరకు గోవాలో జరగనున్న జాతీయ షటిల్ బ్యాడ్మింటన్‌లో వీరిద్దరు జంటగా బరిలోనికి దిగనున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అపర్ణ బాబును స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ప్రతినిధులు సుంకరి సాయిరమేష్, తెర్లి రామ్మోహనరావులు అభినందించారు.

ఆధార్ నమోదుకు స్పెషల్ డ్రైవ్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదు కోసం ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు మండలంలో గల సచివాలయాల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం రంగరాయపురం, కోమటిపల్లి గ్రామ సచివాలయాలలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు బాలాధార్ లేనటువంటి 0- 5 ఏళ్ల చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ చేయించినట్లు స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

నిర్వహణలోకి ఆర్వో ప్లాంట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ నిర్వహణలో లేకపోవడంపై గురు వారం ఆంధ్రజ్యోతిలో 'మరమ్మతులు లేక.. తాగు నీరందక' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆ పాఠశాల హెచ్‌ఎం రమణ స్పందించారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలో గల ఆర్వో ప్లాంట్‌ను నిర్వహణలోకి తీసుకొచ్చారు. ప్లాంటు ద్వారా ప్రతిరోజూ శుద్ధజలం అందిస్తామని చెప్పారు.

ఎడ్లపందెం విజేత లక్కవరం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చంపేట గ్రామంలో శివరాత్రి పురస్కరించుకుని గురువారం తీర్థమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్లపందెం పోటీల్లో ఎనిమిది8 బండ్లు పాల్గొనగా నేమాల నరేష్ లక్కవరం బండి విజేతగా నిలిచింది. చుక్కపల్లి బండి రెండు, దేవరాపల్లి బండి మూడో స్థానం సంపాదించాయి. విజేతలకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

ఓటెత్తిన ఉపాధ్యాయులు

(ఐదో పేజీ తరువాయి)



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఆర్డీవో కీర్తి

జిల్లాలో 2,885కి 2,776 (96.22 శాతం) మంది ఓటు వేయగా, అతి తక్కువగా విశాఖ జిల్లాలో 5529కి 4,829 మంది (87.34 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 5,035కి 4,769 (94.72 శాతం), పార్వతీపురం మన్యంలో 2,333కి 2,187 (93.74 శాతం), విజయనగరం జిల్లాలో 5,223కి 3,912 (94.05 శాతం), అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,488కి 1,310 (88.04 శాతం) మంది ఓటు వేశారు. ఆరు జిల్లాల పరిధిలో ఉదయం పది గంటలకల్లా 21.74 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 57.71 శాతం, రెండు గంటలకు 79.54 శాతం ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసేసరికి 92.4 శాతానికి చేరింది. ఆరు జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కాగా 2019లో జరిగిన ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ జరిగింది. ఈ పర్యాయం 2.4 శాతం ఎక్కువగా ఓట్లు పోలైనట్టు అధికారులు చెబుతున్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

● జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు



మాట్లాడుతున్న మధుసూదనరావు

రామభద్రపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న రేషన్‌కార్డుదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కె.మధుసూదనరావు కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దీనివల్ల డెత్‌లు, మైగ్రేషన్ హోల్డర్లను గుర్తించవచ్చున్నారు. అలాగే ఈ ఏడాది 3 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించామని, దీని కోసం 160 మిల్లులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ధాన్యం ఇచ్చిన రైతులందరికీ 24 గంటల్లోనే డబ్బులు చెల్లించామన్నారు. జిల్లాలో 5 లక్షల 71 వేల 774 మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారని, ప్యూరిఫికేషన్ చేసిన తర్వాత ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయడానికి చర్యలు చేపడుతుందని తెలిపారు. అలాగే 5 లక్షల 2వేల 406 మందికి దీపం పథకం కింద ఉచిత గ్యాస్ మంజూరు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 4 లక్షల మందికి సబ్సిడీ విడుదల చేశామని తెలిపారు. నవంబరు నుంచి మార్చి వరకు మొదటి విడత ఉచిత గ్యాస్ వినియోగించుకోవచ్చునని సూచించారు. అలాగే దీపం-2 కింద ఏప్రిల్ నుంచి జూన్ వరకు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో రేషన్ అక్రమ బియ్యం రవాణాకు అడ్డుకట్టవేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల కాలంలో ఒడిశాకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిని నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని రామభద్రపురం తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎస్‌ఐ వెలమల ప్రసాదరావులకు సూచించారు.

మేధావులే.. ఓటుకు దూరం

ఓటేయని 311 మంది ఉపాధ్యాయులు

రాజాం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మూడు డివిజన్ల పరిధిలో 29 పోలింగ్ కేంద్రాలలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలో 311 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోలేదు. 5223 మంది ఓటర్లు ఉండగా 4912 మంది మాత్రమే ఓటేశారు. తమకు నచ్చిన, తమ సమస్యలు మండలిలో చర్చించి పరిష్కార దిశగా పోరాడుతారన్న నమ్మకంతో ఉపాధ్యాయ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేశారు. కారణాలేమైనా కానీ 311 మంది మేధావి వర్గానికి చెందిన ఉపాధ్యాయులు విలువైన ఓటుహక్కును వినియోగించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పుణ్యగిరిలో భక్తుల కోలాహలం

శృంగవరపుకోట ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శృంగవరపు కోట పుణ్యగిరి ఆలయం వద్ద శివరాత్రి పురస్కరించుకుని బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు భక్తుల కోలాహలం నెలకొంది. ఎస్.కోట రూరల్ సీఐ ఎల్. అప్పలనాయుడు, వేపాడ ఎస్‌ఐ దేవిలు పుట్టదార వద్ద భక్తులకు ఇబ్బందిపడకుండా చర్యలు తీసుకున్నారు. ఉమా కోటిలింగేశ్వరాలయానికి వచ్చే భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకోనేందుకు ఎస్.కోట ఎస్‌ఐ రంగరాజు, ఎల్.కోట ఎస్‌ఐ నవీన్ పడాల్ ఏర్పాట్లుచేశారు.

రామతీర్థంలో..

నెల్లిమర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో శివరాత్రి పురస్కరించుకుని నిర్వహించిన జాతరలో డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. భక్తులు బుధవారం రాత్రి దేవస్థానం ఆవరణతో పాటు కొండపైన, పక్కనే ఉన్న చెరువు గట్లపైన జాగరణచేశారు. జాతరకు వచ్చిన భక్తుల కోసం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వివిధ రకాలు సేవల ందించారు. నెల్లిమర్లలో టీడీపీ ఆధ్వర్యంలో చంపావతి నది వంతెన సమీపంలో పులిహోర పొట్లాట పంపిణీ చేపట్టారు.

2న ఎనస్థీషియాపై సదస్సు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్టు (ఐఎస్ఏ) విజయనగరం శాఖ, నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాల ఎనస్థీషియా డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో మార్చి రెండో తేదీన సదస్సు జరగనుంది. సదస్సుకు దేశ వ్యాప్తంగా సుమారు 300 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.

క్వార్టర్‌పై మరో రూ.10

(ఐదో పేజీ తరువాయి)

ఇప్పటివరకు అదనపు ధర చెల్లిస్తున్న మద్యం ప్రియులు... గత్యంతరం లేక ఈ భారాన్ని కూడా మోయక తప్పడం లేదు. ఇలా మద్యం షాపుల యజమానులు, బెల్టు నిర్వాహకులు కలసి మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

● వైసీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో లోపాలను ఎత్తి చూపిన టీడీపీ శ్రేణులు ఇంత జరుగుతున్నా, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిసినా నోరెందుకు మెదపడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సిండికేట్‌లో అన్ని వర్గాల నేతలు ఉండడంతో నోరు మెదిపేందుకు ఎవరూ సాహసించలేకపోతున్నారని బోగట్టా. ప్రభుత్వం ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించకపోతే అపహాస్యం పాలయ్యే ప్రమాదం లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● మద్యం షాపుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తే మద్యం ఏ విధంగా అధిక మొత్తంలో బయటకు వెలుతుందో తెలుస్తోంది. బెల్టు నిర్వాహకులు అక్రమ మద్యంతో పట్టుబడినప్పుడు మద్యం సీసాలపై వున్న బ్యాచ్ నెంబర్‌ల ఆధారంగా ఆయా షాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేయవచ్చు.

స్వయంగా బెల్ట్ షాపుల నిర్వహణ

పోలీసు కేసులు, పాట ద్వారా గ్రామానికి చెల్లింపులకు ఎవరూ ఆసక్తి చూపని చోట మద్యం షాపుల వ్యాపారులే బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. సీసాపై రూ.20 అదనంగా వేసుకొని గ్రామాలకు తరలించి డోర్ డెలివరీ ఇస్తున్నారు. గ్రామానికి ఒప్పందపు సొమ్మును మద్యం షాపు యజమానే చెల్లించుకుంటున్నారు. గ్రామాన్ని బట్టి నెలకు రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

మహాశివరాత్రి పురస్కరించుకుని గురువారం ఉదయం జిల్లాలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం జాగరణ చేసిన భక్తులు గురువారం ఉదయం శివాలయాల వద్ద బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**



శృంగవరపుకోట రూరల్: సన్యాసేశ్వరస్వామి ఆలయం వద్ద..



వంగర: సంగమేశ్వర ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



బొబ్బిలి: తారకరామాకాలనీ శివాలయంలో..

2న ఇఫ్టూ విలీన సభ

బొబ్బిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న రాజమండ్రిలో రెండు ఇఫ్టూ సంఘాల విలీన సభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం నాయకులు పి.లక్ష్మణరావు, వి.రామ్మూర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం పాతబొబ్బిలిలో విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఇఫ్టూ కార్యదర్శి ఎం.గోపాలం నాయకత్వంలో విలీన సభకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ● మక్కువ: రాజమండ్రిలో మార్చి 2న రెండు ఐఎఫ్‌టీయూ సంఘాల విలీన సభ జరగనుంది. ఈ మేరకు మక్కువలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.